# మూడు ముళ్ళు

"ఒక విధంగా రాయబారమే అనుకోండి. మీ వసంతకు వీలైనంత త్వరలో పెళ్లి చేసెయ్యండి. ఇవిగో మీ అమ్మాయికి వచ్చిన మూడు ప్రేమలేఖలు! అయితే ఇటువంటి వ్యవహారాల్లో తల దూర్చకుండానే, మీ చేతుల మీదుగా సలక్షణంగా పెళ్లి చేసుకోవాలని ఉందని మీ అమ్మాయి చెప్పమంది. ఓమూల భయంగా ఉన్నా, వసంత మాట కాదన లేక మీతో చొరవ తీసుకొని చెప్పినందుకు మన్నించండి" అప్పజెప్పినట్లుగా శారద అన్న మాటలకి విస్తుపోయింది వసంత తల్లి.

"ఏం చోద్యమే - నాకు పెళ్లి చెయ్యండి అని నోరు విప్పి అడగడం! మా కాలంలో ఎరుగుదుమా యిటువంటి వింత?" - తేలికగా అన్నా, ఆ మాటల వెనకాల ఓ రకమైన నిస్సహాయత, కడుపు తరుక్కుపోయే వో తల్లి వేదనా - శారద గ్రహించకపోలేదు. గడుసుగా అంది సమాధానంగా. 'మీకయితే ముచ్చటగా మూడు ముళ్ళూ పదమూడో ఏటనే పడినందుకు అడగవలసిన అవసరం లేకపోయింది కాని మీ వసంత కిప్పుడు యిరవై ఏళ్లు." వసంత తల్లి తిరిగి ఏమంటుందో కూడా వినకుండా శారద వీధి గదిలో కూర్చున్న వసంత దగ్గరకు పరుగెత్తింది.

"..ఇదండీ సంగతి!" మొగుడి చేతిలో మూడు ఉత్తరాలు పెట్టి, తన బాధ్యత తీరి పోయినట్లు వంటయింట్లోకి దారి తీసింది, వసంత తల్లి.

'నూటికి నెలకి అర్ధరూపాయి చొప్పున వెయ్యికి ఏడాదికి ఎంత వడ్డీ అవుతుంది?...' అని ఉత్సాహంగా క్లాసు కుర్రాళ్లకి లెక్కలు చెప్పే రామనాథం మాస్టారు ఒక్కసారిగా డీలా పడిపోయాడు. 'పెద్దకూతురికి మూడు ప్రేమలేఖలు! దానికి పెళ్లి చెయ్యాలి- ఎంత కట్నం... ఎంత అప్పు... ఎంత వడ్డీ? ఉన్నది ఒక ఎకరం పొలం, వో పాత కొంపా, కన్నది నలుగురు సంతానం!'

చూడ్డానికి వసంత బావుంటుంది. మూడు ప్రేమలేఖలు ఊరికినే రాలేదు మరి. చదువుకేమీ తక్కువ లేదు - బి.ఏ. ఆఖరి సంవత్సరం చదువుతోంది. కల్లా కపటం లేని మనిషి - అందుకనే బలహీనతలకి లొంగి కాలు జారుతానేమోనన్న భయం కొద్దీ పెళ్లి చేసెయ్యమని అడిగింది. అన్నీ బావున్నాయి కాని, వరుళ్లు మట్టుకు రామనాథానికి అందుబాటులో లేరు.

ప్రేమ వివాహాల్లో కట్నాల సమస్య ఉండరాదే?- రామనాథం మస్తిష్కంలో వో చిన్న మెరుపు మెరిసింది.

''...చూడబ్బాయీ రాజశేఖరం! నువ్వు మా వసంతకి వ్రాసిన ఉత్తరం చూశాను...' రామనాథం ఆగాడు. 'అబ్బెబ్బె అది...'' రాజశేఖరం కంగారుపడి పోయాడు. అతని భుజం మీద చెయ్యి వేస్తూ రామనాథం అన్నాడు: ''నువ్వు కంగారుపడనవసరం లేదు. నీ ప్రేమను అడ్డదలచుకోలేదు. మా వసంతనిచ్చి పెళ్ళి చేస్తాను - ఏమంటావు?''

రాజశేఖరం తెల్ల మొహం వేశాడు. ''వర్ణాంతర వివాహమంటే మా వాళ్లు డొక్క చీలుస్తారు!'' - అతి కష్టంమీద అనగలిగాడు.

రామనాథానికి కోపమొచ్చింది. తీవ్రంగా అడిగాడు: ''మరి మా వసంతకు ఉత్తరం వ్రాసినదెందుకని?''

''ప్రేమ..కాదు కాదు సరదా...కాదు..'' - రాజశేఖరానికి మరి మాటలు రాలేదు. సైకిలు మీదకు ఒక్క గెంతు గెంతి ఉడాయించాడు.

''ఏమోయ్, చక్రవర్తీ! మా వసంతకు నిన్ను పెళ్లి చేసుకోడానికి ఏమీ అభ్యంతరం లేదు. మీ వంశం, పుట్టు పూర్వోత్తరాలూ నాకు నచ్చాయి కాబట్టి నాకూ అభ్యంతరం లేదు. నీ తల్లిదండ్రులతో మాట్లాడమంటావూ మరి?'' డొంక తిరుగుడు లేకుండా సూటిగా రామ నాథం అడిగిన ప్రశ్నకు, చక్రవర్తి తడబడి పోయాడు.

''ఇప్పుడు పెళ్లి మాట ఎత్తితే నా ముక్కెలు విరుగుతాయి!'' చక్రవర్తి మూలుగు తున్నట్లుగా అన్నాడు.

''అంత ధైర్యం లేనివాడివి ఉత్తరాలు వ్రాయడమెందుకనో?'' రామనాథం హేళనగా అన్నాడు.

''మీ దగ్గర దాపరికమెందుకు? స్నేహితులతో పందెం వచ్చి ఉత్తరం వ్రాశాను. దయ చేసి మా వాళ్లతో చెప్పకండి!'' -చక్రవర్తి చేతులెత్తి వో నమస్కారం పడేసి రామనాథం తేరుకొనేలోగా అక్కణ్ణించి జారుకొన్నాడు.

"...మా వసంతకు వ్రాసిన ఉత్తరం చదివి నీ వేదన అర్థం చేసుకొన్నానోయ్ కృష్ణ మూర్తీ! ఏదో పాతకాలపు వాడినైనా, ఆధునిక సాహిత్యపు ప్రభావం అనుకో... చూస్తున్న సినిమాల ప్రభావం అనుకో - మీ యువతరం ప్రేమల మీద నాకు చాలా అభిమాన మేర్పడింది. నిన్ను మా అల్లుడిగా చేసుకోవడం మాకేమీ అభ్యంతరం లేదు. ఏమంటావు?" క్లాసులో కుర్రాడికి సూత్రం చెప్పి, లెక్క అడిగినట్లుగానే అడిగాడు రామనాథం.

"నాకు మేనమామ కూతురు సిద్ధంగా కూర్చుంది. ఈ పెళ్లికి మా వాళ్లు ఒప్పుకోరు. క్షమించండి!" కృష్ణమూర్తి దిక్కులు చూస్తూ సమాధానం చెప్పాడు.

"మరి ప్రేమలేఖ ఎవర్ని ఉద్ధరిద్దామని వ్రాసినట్టు?" రామనాథం అడిగాడు, రాబోయే ఏడుపును ఆపుకొంటూ.

"ఏదో ఉద్రేకంలో వ్రాశాను క్షమించండి!" వెనక్కు తిరిగి చూడకుండా పరుగుచ్చు కున్నాడు కృష్ణమూర్తి...

బొమ్మలాంటి తన వసంతను నిజంగా ఆటబొమ్మను చేసి ఆడుకొన్నారు! రామనాథానికి కోపం ముంచెత్తుకొచ్చింది.

"...జరిగిన సంగతి యిదండీ! ఆడపిల్లల జీవితాలతో ఇలా చెలగాటాలాడటం ఏమంత సబబైన పని?"

రామనాథం చెప్పిన సంగతులన్నీ శ్రద్ధగా ఆలకించాడు ప్రిన్సిపాల్ శేషగిరి.

"నానాటికీ విద్యార్థి లోకంలో క్రమశిక్షణ దిగజారిపోతోంది. ఏ రోజు ఏం గొడవ వస్తుందేమోనని భయపడని క్షణం లేదు. అయినా ఆ మూడు ఉత్తరాలూ నా దగ్గర వదలి వెళ్ళండి. నే చెయ్యగలిగింది చేస్తాను" - శేషగిరి సానుభూతి చూపిస్తూ, రామనాథాన్ని సాగనంపాడు.

ముగ్గురు కొడుకులూ, ముగ్గురు తండ్రులూ ప్రిన్సిపాల్ బల్ల చుట్టూ కూర్చున్నారు. శేషగిరి కళ్లు నిప్పులు వెదజల్లుతున్నాయి. "...ఎవరూ మాట్లాడరేమండి? ఆ అమ్మాయి నిలా ఆటవస్తువులా ఆడించటం ఎంత నీచమైన పనో ఆలోచించండి. మీ ప్రబుద్ధులు వ్రాసిన ఉత్తరాల్ని నమ్మి, నిజంగా వివాహం చేసుకొనే ఉద్దేశ్యం ఉందేమోనని పాపం ఆ మాస్టారు అభిజాత్యాన్ని చంపుకొని, మనసు విప్పి తన అంగీకారం తెలియచేసినందుకు- ఆయనకు మంచి సమాధానాలే లభించాయి! యిప్పటికయినా మించింది లేదు. మీలో ఎవరు వసంతని స్వీకరించినా చాలా సంతోషించదగ్గ విషయం." - శేషగిరి ఆగి, అందరి వైపూ ప్రశ్నార్థకంగా చూశాడు.

"మా వాళ్ల మీద మాకూ ఎన్నో ఆశలుంటాయి. కట్నాలనీ - కలిసిన సంబంధాలనీ. అయినా కుర్రాళ్లు తెలియక చేసిన పనికి మమ్మల్నిలా బలవంతపెట్టడం మీకు భావ్యం కాదు!" వో హీరో తండ్రి కాస్త గట్టిగానే సమాధానమిచ్చాడు.

"అయితే మీ వాళ్లు తెలియక చేసిన పనికి తగిన చర్యే తీసుకొంటాను. మీరందరూ

వెళ్ళవచ్చు."

"ప్రిన్సిపాల్‌గారూ, అది మీరు అనుకొన్నంత సులభం కాదేమో?" - చక్రవర్తి కొంచెం తల బిరుసుగానే అన్నాడు.

"ఈ విషయంలో నేను జంకేది లేదు. మీరు ముగ్గురూ వ్రాసిన ప్రేమలేఖలూ - దస్తూరీ సంతకాలతో సహా రుజువు కాబడ్డాయి. వాటికి ఫొటో కాపీలు తీయించి అన్ని నోటీసు బోర్డుల్లోనూ ప్రదర్శిస్తాను. ప్రేమలేఖలు వ్రాయడమే కాని, వివాహ సమస్య తల ఎత్తేసరికి జారుకొనే చవటలనీ, అప్రయోజకులనీ అందరకూ తెలియజేస్తాను. తోటి విద్యార్థినిని ఆడించి అవమానించినందుకు సస్పెండ్ చేస్తాను. రేపు ఉదయం కాలేజీలో ఉన్న పన్నెండు వందల మందికీ మీ హీరోల పస తెలియజేస్తే, సాయంత్రమయ్యేసరికి ఈ ఊరి అరవై వేల జనాభా మీ గురించే మాట్లాడుకొంటుంది. విద్యార్థి లోకం సానుభూతి వసంత వైపో, లేక మీ వైపో - చూడాలని నాకు చాలా సరదాగా ఉంది! మీరింక వెళ్లవచ్చు."

శేషగిరి ఉగ్రస్వరూపం చూసి ఆ ఆరుగురూ బిక్కమొహాలతో అక్కణ్ణించి చల్లగా జారు కొన్నారు. బయటకు వెళ్ళిన తర్వాత నోరు జారిన చక్రవర్తి మీద విరుచుకు పడ్డారందరూ.

ఆ రాత్రి ఏడూ - పది గంటల మధ్య ముగ్గురు తండ్రులూ ఒకరి తర్వాత ఒకరూ, ఒకరికి తెలియకుండా మరొకరూ శేషగిరి యింటి మెట్లు ఎక్కి దిగారు.

మర్నాడు ఉదయం రామనాధానికి నాలుగు ఉత్తరాలందాయి,

"అజ్ఞానం కొద్దీ వాళ్లు చేసిన పనికి తీవ్రమైన దండన విధించి, వాళ్ల భవిష్యత్తుని పాడు చెయ్యడానికి నేను జంకిన మాట వాస్తవం. ముగ్గురు తండ్రులూ యిచ్చిన లిఖితపూర్వకమైన క్షమార్పణలు యిందు మూలముగా అందజేస్తున్నాను..."

రామనాధం చిన్నగా నవ్వుకొన్నాడు ప్రిన్సిపాల్ ఉత్తరానికి.

"చూడమ్మా వసంతా! ఇంకొక రెండు నెలల్లో నీ చదువు పూర్తవుతుంది. ఏదో ఉద్యోగంలో ప్రవేశించు. నీకు నచ్చినవాడూ, అభ్యుదయ భావాలు కలవాడూ నీ అన్వేషణలో లభించకపోడు. ఆ శుభ ఘడియల కోసం దైవాన్ని ప్రార్థించడం తప్ప నేను చెయ్యగలిగింది మరేమీ లేదు." -రామనాధం వసంత కివ్వగలిగింది ఈ సలహా మాత్రమే.

మరో నెలకల్లా శేషగిరి కూతురి పెళ్ళి శుభలేఖ రామనాధానికి అందింది. ఏదో ఫిర్యాదు రూపేణా వోసారి ప్రిన్సిపాల్‌ని కలుసుకొన్నంత మాత్రాన -జ్ఞాపకం ఉంచుకొని శుభలేఖ పంపినందుకు రామనాధం ఆశ్చర్యపోయాడు.

అయితే - వసంత కొచ్చిన మూడు ఉత్తరాలూ, తన కూతురు మెళ్లో పడే మూడు ముళ్ళకీ ఒప్పుకొన్న కట్నం పది వేలలో, వో ఆరు వేల రూపాయలు సంపాదించి పెట్టాయన్న కృతజ్ఞతని తెలుపుకోవడం కోసం, ప్రిన్సిపాల్ శుభలేఖ పంపాడని లెక్కల మాష్టారికి ఏం తెలుసు?!

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక : 12-2-1971)